# "రచయితల క్లబ్బు" – ౨

రచయిత :
... నేమాని వీరభద్రరావు ...

తే 2—6—50 దీని రచయితల మహాసభ జరుగనున్న దంటే మా రామం, నేను బయలుదేరాం. మా రామం గాడు వట్టి తంజావూరు సత్రవుమనిషి. ఎంతకూ తెమిలి రాలేదు. క్లబ్బులో వుపన్యాసం అప్పుడే ఆరంభించేరు.

"...................యీ మహాజనసభ ఏర్పాటు చెయ్యడానికి గల ప్రబల కారణం లేకపోలేదు. మన సోదర సోదరీమణులలో, మంచి కృషిచేసి, నివురుగప్పిన నిప్పులా వున్నారు. యిదివరలో ఏ యిక్కట్టులకు గురియైనా, యీ స్వాతంత్ర్యం సిద్ధించిన శుభ ఘడియనుంచి దేశనాయకులు, ప్రజలు గుర్తించకపోయినా, యేమైనా మా సంగతి విపులీకరించుకుంటేగాని (చూడడానికి వచ్చిన ఆసామీ ఒకాయన. పక్షీకరించుకోండి......అని నవ్వేసి క్లబ్బునుంచి జారుకున్నాడు) వీలులేదు. చూశారా! మైనా రిటీతీరి ఒకరిద్దరు ఆడ, మొగపిల్లలకు తండ్రి అయివుండి ఎంత అసభ్యంగా ప్రవర్తించడానికి జంకలేదో! మనలో ఇట్టి క్రమశిక్ష వుంటూంటే యింక మన స్వతంత్రఫలం మనకు ఎలా దక్కుతుంది. In these days of competition, if one does not blow his trumpet, naturally, he will go to the wall అన్నాడు ఆంగ్లకవి. కనుక యితరులు మనలను గుర్తించలేని సమయంలో మనలను మనమే లోకానికి ఎరుకపరుచుకోవాలి. దేశంయొక్క గౌరవం, ఆదేశంలో కవులు దేశంపై వెదజల్లే విజ్ఞానంబట్టి వుంటుంది. ప్రస్తుతం మన క్లబ్బులో 28 గురు సభ్యులున్నారు. ఇతరులు మనగురించి తలచకపోయినా మనలో మనమైనా ఒకరి నొకరికి ఎరుకపరుచుకొని, మనం అందరం ఒకవిధమైన గురుత్వాన్ని సంపాదించాలి. ఇది వరకల్లా, నాయకులైతేనేమి, కవులైతేనేమి వారిగురించి వారు అదే చెప్పుకొనేవారుగారు : ప్రస్తుతపు రోజుల్లో ఎక్కడైనా కాపీకొట్టి ఒక కథవ్రాసేఆయన, బాలకవి, సహజపాండిత్య ధురీణ వగైరాలు, ముందు వెనుక తగిలించుకుంటున్నాడు. లోకం అంతా యీయనకూడా, ఒక గొప్పవాడేమో నని, ముఖ్యంగా పత్రికాధిపులు భ్రమించి "మా సంవత్సరాది సంచికకు ఒక వ్యాసం మీరు వ్రాయాలి" అని ఒక మూడు కాన్లు కార్డు వ్రాస్తే మన నవకవి తనలో ఏదో యిమిడి యున్నది, తను గ్రహించకుండానే యితరులే అందులో పత్రికాధిపుడే గ్రహించి తన వ్యాసంకోసం అర్థించేడు, పాఠకులు యింకా ఎంత తహతహలాడుతున్నారో అని స్వంత అభిప్రాయాలు లేకపోయినా, మపాసాతల, ఛెకోవ్‌తోక, తగిలించి ఒక కథ వ్రాసి పంపిస్తే, పాపం పత్రికాధిపులు ఒక్క కాపీయైనా పంపకుండా (డబ్బు యివ్వటం మొదలే లేదు) వుంటే, తనకథ పడినదని, ఒక కాపీ ప్రత్యేకంగా కొనుక్కుని నలుగురిలోనూ ఫడవేస్తున్నాడు. క్రమేణా అలాటివారే పైకి ఏనాటికైనా వస్తున్నారు కాబట్టి మనం అందరంకూడా లోకంచేత గుర్తింపబడము.

ఇదివరలో కవులు బాధలుపడి, కడకు సరస్వతి లక్ష్మి ఒకచోట వుండవని సూత్రీకరించిపోయేరు. మనం మాత్రం ఆ సూత్రీకరణను సాధ్యమైనంతవరకు మార్చాలి. పూర్వకవుల బాధలు ఒకటిరెండుచెప్తే మీకు అర్థమౌతుంది.

ఒక కవికి వ్రాయడానికి రాత్రి దీపం వుండేదికాదట. పగలు వీధిలోకి వెళ్తే అప్పులాళ్ల బాధలట. కనుక ఓమంచి రోజు చూసి, ఓ భగవంతుడా నాకు రాత్రి దీపం లేకుండా వ్రాసుకొనేశక్తి అనగా పిల్లికి అమర్చిన కళ్ళు నాకూ ప్రసాదించమని వ్రాశాడట. మరొక కవి పత్రికలకు చక్కగా వ్రాసి వ్రాసి, కష్టసమయంలో పత్రికాధిపుణ్ణి రు 10 లు పంపమని దీనాతిదీనంగా వ్రాశాడట.

"ఈపత్రిక ఆర్థికపరిస్థితి చాలా హీనంగా వుందని జబాబు వచ్చిందట! పాపం ఆకవికి ఆకష్టం మళ్లక, కాలగర్భంలో కలిశాడట. ఆయనను పొగుడుతూ, ఆ పత్రికే ఎనిమిది కాగితాలు సంపాదకీయం వ్రాసిందట.

ఇవన్నీ యెందుకు చెప్పవలసివస్తూందంటే, మన దేశంలో తమలో ఏమున్నదో తెలుసుకోలేని రచయితల గతి అధోగతిగా మారుతూందని రుజువుచెయ్యటానికి.

కనుక మన మందరం, ప్రతిసంవత్సరం ఒక్కొక్క రచయిత జీవితచరిత్ర విపులంగా వ్రాసి, ప్రచురించి, మనలను మనమే దేశానికి యెరుకపరుచుకోవాలి. "ముందు ఎవరి జీవితం వ్రాయటమూ అన్నది గట్టి"ప్రశ్న. ఒకరి జీవితము చదవగానే 28 గురు జీవితాలూ చదవాలన్న వాంఛ ప్రజల్లో చెలరేగి నిద్రకూడా పట్టనంత వుత్సాహం కల్గించాలి. "అయ్యా, నా జీవితంలో ఆశ, నిరాశ, ప్రణయం మొదలైనవన్నీ కరడు కట్టుకునివున్నాయండి. ముందుగా నాది వ్రాయించడానికి తీర్మానం కావాలి" అని లేచేడు ఒకాయన. "మీరు అందరూ నాజీవితం వ్రాయించాలి, నాది వ్రాయించాలి అని లేచిపోతే నేను చెప్పలేను. 28 గురు పేర్లూ వ్రాసి లాటరీచీట్లు తీసినట్లు తీద్దాం. ముందుగా ఎవరి పేరు వస్తుందో వారిచే తమ జీవితచరిత్ర చెప్పించి, దానికి చిలవలు పలవలు పెట్టి వ్రాయించాలి" ఆ పద్ధతి బాగానే వుందండీ అని ఒకాయన స్థిరపరిచేడు. వెంటనే ఇరవై ఎనిమిది పేర్లూ వ్రాశారు. పెద్దమనుష్యులక్రింద మమ్మల్ని నిలబెట్టి తియ్యమన్నారు. పక్షపాతం లేకుండా ఒక చీటీతీశాను. ఎవరి పేరు బైటపడిందో అని మహవుత్సాహంగా అందరూ ముందుకు వచ్చారు. "అవకతవకలు అల్లాటప్పయ్య"గారు కలియుగ భస్మాసుర అని వుంది. అందరూ ఆయనకేసి చూసి నవ్వేరు. వెంటనే కార్యదర్శి "మీరు నవ్వటంగాదు ఆయన మన సంఘానికి పునాదిరాయివంటివారు. వీలైనంత వరకు వారి జీవితం లోకానికి ఎరుకపర్చాలి. తద్వారా మన మందరం పైకివస్తాము. కనుక "అల్లాటప్పయ్య మహాశయా, తమరు తమ జీవితాన్ని మాకు యీకరుపెట్టాలి" అన్నారు. "తమ దయకు ఎంతో కృతజ్ఞుణ్ణి" అన్నారు.